
25-11-94 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



# [illegible]

(హాస్యగల్పిక)

– అవసరాల
రామకృష్ణారావు

'వైద్యో నారాయణో హరిః' అనే మాట మీరు వినే వుంటారు. ఇప్పటి వైద్య విధానానికి దాన్ని ఎలా అన్వయించుకోవచ్చునో ఆలోచించారా? ఈ రోజుల్లో లభ్యమయ్యే వైద్యం చేయించుకుంటే నారాయణుడంతటి వాడైనా హరీమంటాడనే అర్థం లేదంటారా? సాటి బంధువయిన మా శ్రీమన్నారాయణగారితో ఆనాటి నా అనుభవం మాత్రం అలా అనిపించింది. ఏళ్ళ తరబడి పట్టుకొన్న నా రొంప ఎన్నాళ్ళయినా తగ్గలేదు. ఏం కొంప ముంచుతుందో పెద్ద డాక్టరు కదా, ఓ మారు అన్నీ చూపించుకుందామని వాళ్ళింటికి వెళ్ళాను.

అన్నీ చూపించుకుందామనే ఉద్దేశం కేవలం సినిమా తారలకే అనుకునేరు. స్కానింగు అంటూ వచ్చాక రోగులకి కూడా ఆ ఖరీదైన తణికీ తప్పని సరికదా!

'రావోయ్, రా సజ్జనులందర్నీ దుర్జనులుగా జమ కట్టకుమరి' అంటూ ఆదో రకం నవ్వుతో నారాయణగారు ఆహ్వానించారు. బాగా మెత్తగా వున్న సోఫాలో కూలబడడం, బొత్తిగా నిండుగా వున్న టిఫిన్ ప్లేటు అందుకోవడం నేను చేసిన నేరాలు కావొచ్చు. అందుకు శిక్షగానే కాబోలు, వన్నాయన నోరు విప్పనిస్తే ఒట్టు. వారి వాక్ప్రవాహానికి వారధి కట్టడానికి ఎంతటి నీలుడూ చాలడు!

"ఇప్పుడిలా వెళ్ళింది, ఎవరూ మా రెండో అమ్మాయి సుబ్బులు.. ఇక్కడ కాస్సేపు నిలబడి మనల్ని ఎగాదిగా చూసి మరీ వెళ్ళింది. అవునా? దాన్లో ఏదైనా వింత మువ్వు పసిగట్టేవా? రెండు కళ్ళూ నిక్షేపంలా వున్నాయనుకున్నావ్ కదూ! ఎంత పొరపాటోయ్! ఎడం వైపుది పూర్తిగా గాజుకన్ను సుమా! పది వేలు మనవి కాదనుకొని సింగపూర్ రాసి ఇది తెప్పించి, ఫిట్ చేయించాము. నేను డబ్బుకి చూసుకోని మనిషిని కదా. పెళ్ళి కావలసిన ఆడపిల్లని అలా ఎలా వదిలెయ్యను చెప్పు!"

"పోన్లెండి నన్ను వదిలెయ్యండి చాలు" అనుకుని లేచి నిలబడబోతే ఆయన చెయ్యి పట్టుకుని కూచోబెట్టాడు. కొనసాగించాడు.

"అయ్యో నా తెలివి తెల్లార, మా పెద్దాడు బాబ్జీ గురించి నీకు చెప్పనే లేదు కదూ! స్కూటర్ యాక్సిడెంట్‌లో వెన్ను దెబ్బతిని మా బాబ్జీగాడికి మగతనమే కోల్పోయే ప్రమాదం వచ్చి పడింది. స్టేట్సు తీసికెళ్ళి యాండ్రాలజిస్టు చేత సర్జరీ చేయించాను. ఇప్పుడెలా తయారయ్యాడో చూశావా రారాజు పెదబాబులాగ!"

"అన్నట్టు మనకివ్వడు కాఫీలు ఇచ్చి వెళ్ళిన మా అమ్మ మొహాన్ని నువ్వు సరిగ్గా గమనించావా? చూస్తే మాత్రం నా వెర్రిగాని నువ్వు పోల్చుకునేదేమిటిలే! రెండేళ్ళ కిందట ఏం జరిగిందో తెలుసా స్టౌ ప్రమాదంలో చిక్కుకుని ఆవిడ మొహం వంకాయలా ఉడికిపోయింది. ఎలాగో ఆర్నెల్లకి బతికి బట్టకట్టిందనుకున్నాం. అయితే ఆ మొహం? ఆ భయంకరమైన మొహం రోజల్లా చూస్తూ ఇంట్లో మిగిలిన వాళ్ళం బతికి వుండాలా! జపాన్ తీసుకెళ్ళి ప్లాస్టిక్ సర్జరీ చేయించాను. ఎన్ని కుట్లు పడ్డాయో, ఎన్ని లక్షల నోట్లు చేతులు మారేయో. ఆ మొహం మామూలుగా అవుతుందంటే మేమే నమ్మలేకపోయాం. అప్పటి ఫోటో దాచాం. తెచ్చి చూపిద్దునా?"

లేచి నిలబడ్డాను 'మరోసారి వచ్చి చూస్తానని'

"అలాగేలే. ఓసారి చెయ్యి జాపు" అంటే అప్రయత్నంగా అలాగే చేశాను.


"ఇంతసేపై నోరు విడిచి మాట్లాడుతున్నాను. నాని నిజం దంతాలే. అని భ్రమపడ్డావ్ కదూ?" అంటూ నారాయణగారు తన కట్టుడు పళ్ళ సెట్టుని తీసి నా చేతిలో పెట్టాడు. శబరి రాముడికిచ్చిన ఎంగిలిపళ్ళకి పోటీకి పెద్ద తేడా ఏమిటనే అంకిత భావంతో. అవలా అక్కడే ఎత్తేసి కాళ్ళకి బుద్ధి చెప్పేను!

నా జలుబు ఒదిలిపోయింది. . అంతే కాదు., నాలోని బలుబు వెలిగింది. 'ఆరోగ్య సదనం' అని సొంత భవనానికి పేరు పెట్టుకున్న నారాయణ గారికి ఇంతగా అనారోగ్య వాతావరణం సృష్టించే హక్కు లేదు.

అయితే 'లోకంలో రోగులేలేరా, రోగ పీడితులందరూ లేని రోగం నటించేవారేనా' అని మీరడిగితే నన్నర్థం చేసుకోనట్టే లెక్క. స్వర్గాలెన్ని వర్గాలో తెలీదు గాని నరకాలు నానా రకాలని ఎవరికి తెలీదు! ఇంతగా దేశ జనాభా వాతావరణ కాలుష్యమూ పెరిగిన ఈ లోకంలో పాతవే కాదు, ఎన్ని కొత్త రోగాలైనా ముందు ముందు బయట పడొచ్చు. వైద్యం ఖరీదు పెరిగి ఎంతటి నవాబూ గరీబు కావొచ్చు. వ్యాధి పీడితులెవరికైనా హృదయమున్న వారి సానుభూతి తప్పదు. అయితే నేననేది ఏ రోగి అయినా తన జబ్బుగురించి ఇటు వైద్యుడికీ అటు ఆప్తులకీ తప్ప మరొకరికి చెప్పి సెల్ఫ్ పిటీ ప్రదర్శించకూడదని. రోగ ప్రసారం అనేది సూక్ష్మ జీవులకి మాత్రమే ఒదిలెయ్యాలని.

ముప్పై మైళ్ళు మాత్రమే ప్రయాణం చేసే ఓ నాన్‌స్టాప్ బస్‌లో నా మరో అనుభవం మీకు చెబితే సంగతి స్పష్టమౌతుంది. బస్సు ఇలా స్టార్టు అయింది మొదలు అలా స్టాపుఅయ్యే వరకూ ఆవిడ నోరు కట్టలేదు. కైవారమే కాదు ఆమె కంఠస్వరం కూడా బాగా పెద్దది మరి. ఏ మందుల






షాపులోనో గలగలలాడుతూ గల్లా పెట్టె దగ్గర కూచోవలసిన గంగా భాగీరథి. బస్సు స్పీడుగాని హోరుగాని ఆ గొంతుక నొక్కలేక పోయిందంటే విన్నవాళ్ళు తప్ప నమ్మడం కష్టం.

"సరి..సరి.. అడక్క అడక్క నా ఆరోగ్యం గురించే అడిగారూ అన్నగారూ! పైకిలా దుక్కపోతులా కనిపిస్తున్నాను గాని నా ప్రాణం ఎక్కడో ఎంతో అణగంటిపోయి వుంటుందంటే ఎవరు నమ్ముతారు? తిందామంటే గుప్పెడు మెతుకులు అరగవు. పడుకుందామంటే చించుకున్నా రెప్పలు మూతపడవు. సిగ్గు విడిచి మొగాళ్ళతో అన్నీ ఎలా చెప్పుకోను! అయినా అడిగారు గనక చెప్పకపోతే ఏం బాధపడతారో! అదివరకు ముక్కూ మొహం తెలియక పోయినా ఎంతో ఆప్యాయంగా అన్నీ అడిగారు. మీ దగ్గర ఎలా దాచను. అన్నగారూ! ఎప్పుడేం పాపం చేసుకున్నానో ఇప్పటికే నరకం అను




భవిస్తున్నాను. నిలువుగా, అడ్డంగా నా శరీరం మీద ఓ అరడజను కోతలైనా పడి వుంటాయి. పేగులు పీకేశారు. ఎముకలు లాగేశారు. నరాలు తోడేశారు. కీళ్ళు ఏరేశారు. రక్తం పీల్చేశారు. ఇంకేం చేస్తారు. ఈ మాయదారి బొందిని! అయినా నాకు చావురాలేదు! ఇంకా ఏం రాసి పెట్టుందో'.

ఆవిడకైన శస్త్ర చికిత్సా రహస్యాలు పూసగుచ్చినట్టు ఏకరువు పెడుతూంటే యావన్మందీ బిక్కచచ్చి వింటున్నారు. జరిగిన ఆపరేషన్లూ మింగిన వివిధ రకాల మందులూ ఓ లిస్టుగా రాసి 'రోగ సామ్రాజ్యంలో నన్ను మించిన రారాణి వుందా?' అనే ఛాలెంజింగ్ డాక్టరేటు అందుకునే ఆవేశంతో వుందామె. ఆ సబ్జెక్ట్‌లో యూనివర్శిటీ ఫస్టు కొట్టేసి ఆవిడెత్తు బంగారు కప్పు అందుకోడానికి సిద్ధంగా వున్నట్టుందామె. ఆ మేరకు సంతోషమే గాని కిక్కిరిసిన బస్సుని మరింత ఉక్కిరి బిక్కిరి చేసే అధికారం ఎవరిచ్చారు?

లోకంలో రోగంతో ఊపిరి తీసుకోలేని వ్యాధిగ్రస్తులు ఒకరే కాదు. అనేక రకాల దోపిడీలకు గురై ఊపిరి సలపని వేలాది దుఃఖభాజనులు కూడా వున్నారు. శరీర బాధ ఒక్కటే బాధ అనుకుంటే ఎలా? ఏమీ లేని వాళ్ళూ, అన్నీ వుండీ ఎవరూ లేనివాళ్ళు, ఏ తప్పూ చెయ్యకపోయినా శిక్ష అనుభవించే వాళ్ళూ ఎంత మంది లేరు! ఇప్పటికే ఈ భూమి అనేక రకాల విషాదాల బరువుతో ఓ పక్కకి ఒరిగిపోయి వుంది. మీ వ్యక్తిగత వ్యధలని పది మందికి చెప్పి దాన్ని మరింత భారం చెయ్యడం ఏం న్యాయం?

అందుకనే ఇలాంటివాళ్ళ నోటికి జడిసి, కాళ్ళ బేరానికి దిగి బతిమాలుతున్నాను ఏమని?

రుజల్ని పంచకండి!

ప్రజల్ని చంపకండి!